
ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

ఆర్టీసీ ఆస్తులను కాపాడుకుందాం..

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలాని బాష



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ


ప్రజా సంస్థ అయిన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌కే.జిలాని బాష పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ ఆస్తులను కాపాడుకుందాం అనే అంశంపై ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మల్లికార్జున్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌కే.జిలాని బాష, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, వి.నాగరాజు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవాలని అన్నారు. కార్పొరేట్లకు అప్పగిస్తే ఆర్టీసీ మూసివేతకు దారి తీస్తుందని, ప్రజాసంస్థని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పైనా ఉందని అన్నారు. ఈ సదస్సు నుంచే పోరాట కార్యక్రమాలు ముమ్మరం చేయాలని కోరారు. విజయవాడలో గవర్నర్ పేట- 2 డిపోని లులు కంపెనీకి ఇవ్వడాన్ని ఈ సదస్సు వ్యతిరేకిస్తుందన్నారు. గత వారం రోజులుగా విజయవాడలో సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు, వ్యాపారస్తులు అందరూ ధర్నా నిర్వహిస్తున్నారని తెలిపారు. విజయవాడ నడిబొడ్డులో రూ.400 కోట్లు విలువ గలిగిన ఆస్తిని, 500 మంది పనిచేస్తున్నా వారిని తీసివేసి కార్పొరేట్లకు ఇవ్వడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరుతెన్నులు మార్చుకోకపోతే నిరవధిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఎస్‌డబ్ల్యూ ఎఫ్ జోనల్ కార్యదర్శి సి.భాస్కర్, అధ్యక్ష కార్యదర్శులు ఎన్ఎస్ మణ్యం, శివకుమార్, సుధాకర్, పిఎం.రత్నం ఐవి.రమణ, ఆర్.కష్ణయ్య, డిపో అధ్యక్ష కార్యదర్శులు, సీఐటీయూ నాయకులు కే.వేణు, మాధవ్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ప్రముఖులు



ప్రజాశక్తి- ఐరాల: శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని ఆదివారం రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, తిరుపతి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి వేరువేరుగా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు ఉన్నారు.

తిరుపతిలో భారీ వర్షం



రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి 7 గంటలకు భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు రోడ్లు పూర్తిగా జలమయ్యాయి. దీంతో మురుగు కాలువల్లోని చెత్తాచెదారం రోడ్లపైకి రావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డిఆర్‌మహల్, రాయలచెరువు అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. తిరుపతి వెస్ట్ చర్చి రైల్వే బ్రిడ్జి వద్ద వర్షం నీటి నిల్వ చేరిపోవడంతో

2లో



ఆగని గజ దాడులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని ఏనుగుల గుంపు దాడుల వల్ల రైతులకు ప్రతిరోజు నష్టం తప్పవడం లేదు. ఈమధ్య కాలంలో ఏనుగుల దాడులు వల్ల నష్టపోయిన రైతులు వ్యవసాయం చేయాలంటేనే భయపడుతున్నారు. ఏనుగు పగలంతా అడవుల్లో తిష్ట వేసి రాత్రి వేళల్లో పంట పొలాలపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున పులిచెర్ల మండలం దేవలంపేట పంచాయతీ మిట్టమీద రాచపల్లి గ్రామం రైతులకు చెందిన కొబ్బరి చెట్లు, అరటి చెట్లు, టమాటా, వరి పంటలను తిని, తొక్కి నాశనం చేశాయి. గత కొద్ది రోజులుగా 15 ఏనుగుల గుంపు అటవీ ప్రాంతం నుంచి వచ్చి పంటలను తొక్కి మళ్ళీ అడవుల్లోకి వెళ్ళిపోతున్నాయి. ఏనుగుల దాడుల్లో రైతులకు పంట నష్టం తప్పడం లేదని వారు వాపోతున్నారు. కుంకి ఏనుగుల ద్వారా పెద్దగా ఉపయోగం కనిపించడం లేదని, అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతిలో భారీ వర్షం

ఎంఆర్.పల్లి వెళ్లే ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే లక్ష్మీపురం సర్కిల్, మధురనగర్ ఇళ్లలోకి నీరు చేరడంతో ఇంటిలోని వస్తువులన్నీ తడిచిపోయాయి. ఇందిరి ప్రియదర్శిని కూరగాల మార్కెట్ వద్ద వర్షపు నీరు రావడంతో ఫుట్‌ఫాత్‌పై కూరగాయలు పెట్టుకుని వ్యాపారం చేసుకునే వాళ్ళు ఇబ్బందులు గురయ్యారు. లీలామహల్ నుంచి కరకంబడి రోడ్డు, మధ్యమాను రోడ్డు వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడం జరిగింది. తిరుపతి- రేణిగుంట మార్గంలో ఆటోనగర్ వద్ద రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఖజానా జ్యువెలర్స్ సమీపంలో ఉధృతంగా వర్షం నీరు ప్రవహించడంతో అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. గత రెండు రోజుల నుంచి నగరంలో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్డు గుంతలుపడ్డాయి, సిమెంట్ రోడ్లు రూపురేఖలు మారిపోతున్నాయి.

21న రాగి రేకులకు వేలం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కాపర్ సిల్వర్ కోటెడ్ రాగి రేకులు ఈనెల 21వ తేదీలలో టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్) వేయనున్నారు. ఇందులో కాపర్ (3000 కేజీలు) -15 లాట్లు 21న వేలానికి ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో గల టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం (వేలం) 0877-2264429, నంబర్లలో కార్యాలయం పనివేళల్లో, టీటీడీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని టిటిడి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

15 నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వకాఅధికారి కృష్ణనాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ ఆవరణలో ఆడికృత్తిక వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, మాజీ ఆలయ అధ్యక్షులు రవియాదవ్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ నాగేశ్వర రాజు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్, కె.ప్రసాద్, ఎమ్మెల్యే సోదరులు రాజా, రాధాకృష్ణ యాదవ్, రాజేంద్రరెడ్డి, గోవిందస్వామి, శ్రీనివాసులు యాదవ్, జగన్నాథం పాల్గొన్నారు.



చెక్ డ్యాంలను వదలని ఇసుకాసురులు

వంకలు సాగుతున్నాయన్న ఆనందాన్ని మిగల్చని చెక్ డ్యాంలు..
30 ఏళ్ల క్రితం నిర్మాణాలు ఇసుకాసురుల దాహానికి ధ్వంసం..

ప్రజాశక్తి- సోమల: మండలంలోని అనేక ప్రాంతాలలో వాగులు, వంకలకు అడ్డుగా నీరు నిలిచేందుకు వర్షపు నీరు నిల్వ ఉండేందుకు ఏళ్ల క్రితం చెక్ డ్యాంలు నిర్మించడం జరిగింది. ఈ డ్యాముల వద్ద నిలిచిన నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని వందల ఎకరాల వ్యవసాయ భూములలో బోర్లు బావులు భూగర్భ జలాలు పెంపొందేందుకు ఉపయోగపడేవి. పశువులు, పక్షులు దాహార్తిని తీర్చడానికి కూడా ఆ డ్యాముల్లోని నీరు ఉపయోగపడేవి. అయితే ఇసుకాసురుల దాహానికి చెక్ డ్యాంలు సైతం ధ్వంసం అవుతున్నాయి. చెక్ డ్యాంల్లోని ఇసుకను సైతం తోడేయడంతో గత నాలుగు ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు జలకలతో పరుగులు పెడుతున్నా చెక్ డ్యాములు నీటిని నిల్వ ఉంచుకోలేక వృధాగా పోతూ ఉన్నాయి. గతంలో పలువురు నాయకులు రైతుల మేలుకోరి రైతుల పంట పొలాలలో ఏడాదికి మూడు పంటలు పండించే విధంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే నేడు కొందరు నాయకులుగా చెలామణి అవుతూ తమ స్వలాభాల కోసం వంకలలో వాగులలోని ఇసుకను జెసిబిల ద్వారా త్వవేసి అమ్ముకుంటున్నా వారి ధనదాహం తీరక చెక్ డ్యాంలను కూడా ధ్వంసం చేసి 100 అడుగుల మేర గుంతలను చేసి అటు రైతులకు ఇటు వ్యవసాయ పొలాలకు ఉపయోగం లేకుండా చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ వారు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి, ఇలా ధ్వంసమైన చెక్ డ్యాంలను పరిశీలించి వాటి మరమ్మతులు చేయడమో లేక నూతన చెక్ డ్యాంలను నిర్మించాలి. అలాగే ఇసుకను తోడేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ మండలంలో ఎక్కడెక్కడ చెక్ డ్యాంలు ధ్వంసం అయ్యాయో వాటిని పరిశీలించి నూతన చెక్ డ్యాంలను నిర్మించడమో లేక ఉన్న చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం చేసి రైతులను ఆదుకోవాలని, భూగర్భ జాలాలు ఇంకిపోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అడుసుపల్లె వద్ద చెక్ డ్యాంలోని ఇసుకను జేసిబిలతో తవ్వేయడంతో వృధాగా పోతున్న వాన నీరు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొంగారెడ్డిపల్లెలోని ఐటిఐ గ్రౌండ్లో విద్యార్థులకు క్రికెట్ పోటీలు ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ పోటీలను ప్రారంభిస్తూ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, బాలసుబ్రమణ్యం ప్రస్తుత ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మసూద్ మాట్లాడారు. చిత్తూరు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు క్రికెట్ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎంతో వ్యయప్రయాసలతో చిత్తూరు హాస్టల్లో చదువుతున్నారని వారికి ప్రభుత్వమే ఆటలకు కావలసిన వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిరంతరం చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో నిరంతరం విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రకాల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగిందని, పోటీల్లో పాల్గొని గెలిచిన టీంకి ఆగస్టు 15 బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లోనూ హాస్టల్లోనూ అన్ని రకాల మేధోశక్తి ఉన్న విద్యార్థులు ఉన్నారని వారికి తగిన తర్ఫీదిస్తే అన్నిట్లోనూ రాణిస్తారని ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరులో వున్న స్కూల్ దగ్గర కాలేజీల దగ్గర గుట్కా తదితర మత్తు కలిగించే పదార్థాలు అమ్ముతున్నారని పోలీసుల నిఘా పెట్టి వాటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఎస్టేట్లో ఉన్న హాస్టల్ నుంచి విద్యార్థులు చిత్తూరు నగరంలో ఉన్న వివిధ స్కూలు కాలేజీల్లో చదువుతున్నారని వారికి కాలేజీలకు రావడం సుదూరంగా ఉందని తెలిపారు. వారికి రవాణా సౌకర్యం కల్పించి భద్రత కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా అధికారులు కలెక్టర్ చొరవ తీసుకొని రవాణ సౌకర్యానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఆధ్వర్యంలో ఒక టీమ్, మహేష్ బాబు ఆధ్వర్యంలో మరో టీం క్రికెట్ ఆడగా సాయి టీం విజేతగా నిలిచింది. ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, నిసాద్, వెంకట్ పాల్గొన్నారు.



క్రీకెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నేడు పులిచెర్లలో
ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా స్థాయి ప్రజా గ్రీవెన్స్ పరిష్కార సమావేశం (పిజిఆర్ఎస్) 11వ తేదీ సోమవారం ఉదయం 9:30 పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పులిచెర్ల, రొంపిచర్ల మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అధికారులు, డివిజనల్ అధికారులు పాల్గొంటారు. జిల్లా ప్రజలు వయ్యప్రయాసాలతో సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌కి రావద్దని ప్రజలు గమనించాలని పై ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసు శాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

ఉపాధ్యాయుల హక్కులకై పోరాడుతున్న యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ హక్కుల కోసం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) విరామం లేని పోరాటాన్ని సాగిస్తోందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, జిల్లా కార్యదర్శి ఏకాంబరం తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ 52వ దినోత్సవాన్ని పురస్కరించుకొని యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 51 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటాన్ని నిర్వహిస్తున్న సంఘంగా ఉపాధ్యాయుల మన్ననలను పొందిన ఏకైక సంఘం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్ జనార్ధన్, అరుణ, శివప్రసాద్, పలువురు ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.



నాటక రంగం వన్నె తగ్గకూడదు

ప్రజాశక్తి- తిరుపతి సిటి: కళలు, నాటక రంగం వన్నె తగ్గకూడదని వక్తలు తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 5002వ కార్యక్రమంగా 'అహెూ ఆంధ్రభోజ' నాటక ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుబ్బరాజు నాట్య కళాపరిషత్ - తిరుపతి ని ఆరంభించి, నాటిక, నాటకాల పోటీలను నిర్వహిస్తూన్న నవయుగ కళాభోజుడు కోనేటి సుబ్బరాజు నాటిక, నాటక రచయిత, సంగీత దర్శకుడు, రంగస్థల నటుడు, నిర్దేశకుడని, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన ఎంతో పేరు, ప్రఖ్యాతి, గుర్తింపును సొంతం చేసుకున్నారు. కళారంగ సేవలో తాను ఇతోధికంగా నష్టపోతున్నప్పటికీ తనను నమ్మిన కళాకారులు, తాను అమితంగా ప్రేమించే నాటక రంగానికి అంతరాయం కలగకుండా, కళాకారులకూ కష్టం, నష్టం రాకుండా ఆదుకుంటున్న కళామతల్లి ముద్దుబిడ్డ కోనేటి సుబ్బరాజు అని చెప్పారు. ఈయన నాటక రంగానికి ఓవైపు ఉత్తమ కళాకారులను అందిస్తూ, మరో వైపు ఔత్సాహిక కళాకారులనూ పరిచయం చేస్తూ, ప్రోత్సహిస్తున్న మహెూన్నత పోషకుడని, తన సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ద్వారా జాతీయ స్థాయిలో 5001 ప్రదర్శనలు పూర్తి చేసారంటే అది అతిశయోక్తి కాదని, దాని వెనుక అతని శ్రమ, కృషి, పట్టుదల ఎంతో ఉందని కొనియాడారు. కోనేటి సుబ్బరాయుడు అంతర్జాతీయ స్థాయి లోనూ తాను తన కళలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రేమాభిమానాన్ని చూరగొనాలని కోరుకున్నారు. ఈ నాటక ప్రదర్శనకు సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ సురభి నాటక సంస్థకు కూడా ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమ సభాధ్యక్షులుగా తిరుపతి హోటల్ తాజ్ ఛైర్మన్, మబ్బు సూర్యనారాయణ రెడ్డి, తిరుపతి మాజీ శాసన సభ్యురాలు మన్నూరు సుగుణమ్మ, తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్అఫీషియో సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సైకం జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంతరాజీ మోహన్, ఎంఎ జబ్బార్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, టిడిపి సీనియర్ నాయకులు శింగంశెట్టి సుబ్బరామయ్య, బై 'ఎన్' సేవ్ ప్రొప్రైటర్ మధు, టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షులు ఆర్. కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఈడిగ సంఘం నాయకుల హర్షం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మద్యం దుకాణాలలో తమకు పది శాతం దుకాణాలు కేటాయించడంపై ఈడిగ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈడిగ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడిగసంఘ నాయకుడు తంబయ్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం దుకాణాలలో పది శాతం కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఈడిగ సంఘ సభ్యులు టిడిపి నాయకులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు చెంగల్ రాయల్ యాదవ్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్ నాగేశ్వర రాజు, ఈటిగా సంఘ సభ్యులు మోహన్, వేలాయుధం, రుక్కు బాబు, ముని రాజా, టిడిపి నాయకులు పొద్దుటూరు రాజా, రవి యాదవ్, రాజేందర్ రెడ్డి, తిరుమల నాథ్, జగన్నాథం, కుమార్ స్వామి రాజు, వెంకట ప్రసాద్, బిజెపి నాయకుడు రాజశేఖర్ పాల్గొన్నారు.



ఘనంగా సాము జన్మదినం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం వైసిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, కొత్తపల్లి మిట్ట వైసిపి నాయకుడు సాము జన్మదిన వేడుకలను అభి మానులు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49. కొత్తపల్లి మిట్ట కు చెందిన యువ నాయకుడు సాము పుట్టినరోజు సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి పాల్గొన్నారు. యువతే ముందు ఉండి నిర్వహించారు. కొత్తపల్లి మిట్ట వాణిజ్య కూడలి లోని మహానేత వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి కంచి విగ్రహం ముందు బాణ సంచాలు పేల్చి భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవ రెడ్డి, విజయ బాబు, కుప్పయ్య, జనార్ధన్, దేవ రాజులు రెడ్డి, సుదర్శన్, శేషాద్రి, కిరణ్, భవానేష్, భరత్, ఏసురాత్నం, ధరణి,అరుణ్, సుజిత్, సంసెన్, మాధవ, సాయి ,కొత్తపల్లి యూత్ పాల్గొన్నారు.

వైసిపి బిసి మండల అధ్యక్షుడుగా వెంకటేష్

ప్రజాశక్తి- పాలసముద్రం:



వైసిపి బిసి మండల అధ్యక్షు డుగా జె వెంకటేష్ మందడిని నియ మించి నట్టు వైసిపి కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీలో సుదీర్ఘంగా పనిచేసిన వెంకటేష్‌కి బీసీ కమిటీ అధ్యక్షుడుగా నియమించడాన్ని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మారుమూల గ్రామం నుంచి వచ్చిన తనని బిసి మండల అధ్యక్షుడిగా ప్రకటించి నందుకు పార్టీకి రుణపడి ఉంటానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రాల పేరుతో మాయ!

బంగారు అపహరించి ఉడాయించిన దొంగబాబా

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మంత్రాల పేరుతో మాయచేసి బంగారు ఆభరణాలు అపహరించి ఉడాయించిన సంఘటన ఇది..మండల పంచాయతీకి చెందిన నాగిరెడ్డిపల్లి వాసి ఎం లక్ష్మమ్మ, ఆమె కుమార్తె ఎం పార్వతమ్మ మానసిక వ్యాధితో బాధపడుతోంది. పక్కింటి ఓ మహిళ వారి వద్దకు వచ్చింది. లక్ష్మమ్మ కుమార్తె పార్వతమ్మకు జబ్బు నయం చేయడానికి ఒక బాబా ఉన్నాడని చెప్పింది. ఈ మాటను నమ్మిన లక్ష్మమ్మ ఆదివారం తన వద్దకు 25 ఏళ్ల వయస్సు ఓ దొంగ బాబాను నమ్మింది. అతను చెప్పిన విధంగా కొంత ఇసుకను తెమ్మన్నాడ. ఒక గ్లాసులో శరీరంపై వున్న నగలన్నింటిని అందులో వేయాలని సూచించాడు. బంగారు నగలను తీసి అతని చేతిలో పెట్టింది.



అనంతరం ఆ నగలను గుడి వద్ద పెట్టాలని ఆ దొంగ బాబా అక్కడ నుండి ఉడాయించాడు. దొంగ బాబా ఏం చేశాడో గుర్తులేదని, అతను చెప్పిన విధంగా చేశామని, మరి ఎందుకు చేశామో తమకు అర్థం కావడం లేదని, అతను ఏదో మాయ చేశాడని బాధిత మహిళ వాపోతోంది. ఎలాగైనా తమ నగలు తమకు ఇప్పించాలని పోలీసుకు ఫిర్యాదు చేసింది. బైరెడ్డిపల్లి ఎస్ఐ పరశురాముడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పరీక్షా విధానాన్ని సవరించాలి: వైసిపి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా అన్నీ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఎఫ్ ఏ 1 పరీక్షల విధానంలో పలు మార్పులు అవసరమని వైసిపి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ.రెడ్డి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సోమవారం నుండి జరుగుతున్న ఎఫ్ఏ 1 పరీక్షలు ఉపాధ్యా యు లకు అటు విద్యార్థులకు ఓ పరీక్షగా మారిందని విమర్శించారు. ఇంతవరకు నూతన పరీక్ష విధానం పట్ల ఏ అధికారి నేటి వరకు ఉపాధ్యా యులకు అవగాహన కల్పించలేదని తెలిపారు. మండల కేంద్రం నుండి ఉపాధ్యాయులు అసెస్మెంట్ పుస్తకాలు తెచ్చుకోవడం ఓ పరీక్ష అయితే, ప్రతిరోజు పరీక్ష పత్రాలు తెచ్చుకోవడం మరో పరీక్ష అవుతున్నదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు పరీక్షల అనంతరం అసెస్మెంట్ పుస్తకాల్లో వారి రెస్పాన్స్ రాయడం కష్టతరమని, ఉపాధ్యాయులు లీప్ యాప్ ద్వారా ఓఎంఆర్ షీట్లు స్కాన్ చేయడం కష్టతరమని తెలిపారు. ఈ పరీక్షలు ఒక ప్రహసనంగా మారిం దని, అధికారులు ఎవరిని పరీక్షరించడం కోసం చేస్తున్నారో బేతళ ప్రశ్నగా మారిందని విమర్శిం చారు. ప్రపంచ బ్యాంకు నిధుల కోసం కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను భయాం దోళ నలకు ఇలా గురిచేస్తుందని వా పోయారు. కూటమి ప్రభుత్వం ఉప యోగపడని విద్యా విధానాలను, పరీక్షా విధానాలను తక్షణమే విద్యార్థులకు స్వేచ్ఛగా వుండేలా మార్పులు చేయా లని డిమాండ్ చేశారు.

జిల్లా రెవెన్యూ ఎన్నికల్లో ఇద్దరు డిప్యూటీ తహశీల్దారులు ఏకగ్రీవం

ప్రజాశక్తి- పాలసముద్రం: చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రెవెన్యూ ఎన్నికలలో పాలసముద్రం మండలంలో పనిచేస్తున్న ఇద్దరు డిప్యూటీ తహశీల్దారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పాలసముద్రం రెవెన్యూ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే రెవెన్యూ ఎన్నికల్లో పాలసముద్రం మండలంలో డిప్యూటీ తహశీల్దారు గా పనిచేస్తున్న రిషి వర్మ రెవెన్యూ సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ గాను, రీ సర్వే విభాగంలో డిప్యూటీ తహశీల్దారు గా పనిచేస్తున్న అశోక్ కుమార్ జిల్లా రెవెన్యూ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఒకే మండలంలో పనిచేస్తున్న ఇద్దరు డిప్యూటీ తహశీల్దారులు జిల్లా



రెవిన్యూ సంఘం ఎన్నికల్లో ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని పాలసముద్రం తహశీల్దారు అరుణ్ కుమారి తెలిపారు. వీరి ఆధ్వర్యంలో మండలంలోని ప్రజలకి మరింత సేవ చేయాలని ఈ సందర్భంగా తహశీల్దారు సూచించారు

కరుణాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గత జగన్ ప్రభుత్వంలో భూ కబ్జాలు, అరాచకాలకు పాల్పడిన కొందరు దాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ కోరారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో దళిత యువకుడిపై దాడికి కారకులైన వైసిపి నాయకులు కరుణాకర్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. అత్యంత దారుణంగా దళిత యువకుడిని బంధించి గాయపరచడమే కాకుండా సమర్థించుకుంటున్న వైసిపి నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు అన్నారు. టిడిపి పాలనలో వైసిపి అరాచకాలకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. అవసరమైతే కరుణాకర్ రెడ్డి ఇంటిముందు ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి దళిత నాయకులు అశోక్, మేషక్ లతోపాటు మోహన్ రాజ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

బాపన కుంట చెరువుకు గండి

రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని ఆందోళన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని బాపనకుంట చెరువు మూడు చోట్ల గండి పడింది. దీని ప్రభావం వల్ల బైరెడ్డిపల్లి నుండి పుంగనూరుకు జాతీయ రహదారిలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రజలు ప్రయాణిస్తున్నారు. చెరువు కట్ట కోతకు గురువు అవుతోంది. ఈ కట్టపై హైదరాబాదు నుండి కేరళకు భారీ వాహనాలు వెళుతుంటాయి. ఈ చెరువు కట్ట పై నుండి వెళు తున్న వాహనాలు ప్రమాదవశాత్తు కోతకు గురి అయిన ప్రదేశం వైపు వెళితే ప్రమాదాలు జరుగుతాయని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కట్టపై అనేక ప్రదేశాలలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల కట్ట కోతకు గురైంది. ఈ కోత కాస్త పెరిగి వర్షాలు కురిస్తే చెరువు కట్ట తెగిపోతుందని పరిసర రైతులు తెలిపారు. వెంటనే సంబంధిత రోడ్డు భవనాల శాఖ వారు కోతను గుర్తించి మరమ్మతులు చేయాలని పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు.



కారు, బైకు ఢీ

వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం తొట్టంబేడు మండలం పొయ్యి పంచాయతీ, మల్లి గుంట క్రాస్ రోడ్ సమీపంలో చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ బలరాం కథనం మేరకు.. మండలంలోని లింగంనాయుడు పల్లి పంచాయతీ హరిజనవాడలో వుంటున్న కోగిల ఓసూరయ్య, వెంకటమ్మ దంపతుల కుమారుడు కోగిల జయరాం (37) ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని కాసా గార్డెన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తన కుమార్తె వర్షిణితో మాట్లాడి తిరిగి తన స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మల్లిగుంట క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడం తో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. స్థానికుల ఫిర్యాదుతో హైవే మొబైలింగ్ పోలీస్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తీసు కెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతిని బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. మృతునికి భార్య రేణుక, కుమారుడు పవన్, కుమార్తె వర్షిణి ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి మృతితో కుటుంబ సభ్యులు మాకు దిక్కెవరంటే ఆవేదన వ్యక్తం చేశారు.

చైను చోరీ కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - నాగలాపురం: బంగారు దుకాణంలో చైను దొంగతనం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. జూలై 19 వ తేదీ నాగలాపురం బజారు వీధిలోని మహావీర్ బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలుకు వచ్చినట్లు వచ్చి 12 గ్రాములు విలువైన చైన్ అపహరించుకుని వెళ్లారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా దృశ్యాలు ఆధారంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక బైపాసు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సంబంధిత నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి బంగారు చైను, కార్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ మేరకు నిందితులైన చింతలపల్లి పంచాయతీ, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లాకు చెందిన వేముల జ్యోతి (35), భర్త వేముల నరేష్(37), వేముల నరసమ్మ (35), భర్త వేముల తిమ్మయ్య (36) ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు. నాగలాపురం పోలీసులను స్థానికులు, వ్యాపారస్తులు అభినందించారు. ఎస్ఐ సునీల్‌తోపాటు శిక్షణ ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబల్ సాయికృష్ణ, హెూంగార్డ్ ఈశ్వర్, ప్రసాద్, దేశమ్మ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

కోకో కోలా కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఏర్పేడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని కోకో కోలా కంపెనీ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం, కుంటిపూడి దళితవాడకు చెందిన నవీన్(25) శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరు సమీపంలోని కోకో కోలా కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం ఏర్పేడు మీదుగా విధులకు వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు కుంటపూడి నుండి వెళ్తుండగా దుర్గి పేరి, కృష్ణంపల్లి బస్టాపుల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. మృతుడు అవివాహితుడని సమాచారం. తల్లిదండ్రులు, బంధువుల రోదనతో ఆ ప్రదేశమంత విషాదంగా మారింది.

'వందేభారత్' ఢీకొని వలస కార్మికుడు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వందే భారత్ రైలు ఢీ కొట్టడంతో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ వలస కార్మికుడి దుర్మరణం చెందిన విషాద ఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని చెర్లోపల్లి పల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రైల్వే పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సచిన్ సింగ్(21) కోకా కోలా పరిశ్రమలో వలస కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెర్లోపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లాడు. చెవిలో హెడ్ సెట్ పెట్టుకుని పాటలు వింటూ ట్రాక్ వెంట నడుస్తుండగా తిరుపతి నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ ఢీ కొట్టింది. దీంతో సచిన్ సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు మృదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

హంద్రీ -నీవా పనులు పరిశీలన

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరులో కొనసాగుతున్న 'హంద్రీ-నీవా' కాలువ పనులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. పట్టణానికి సమీపంలోని సింగిరిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో వెళుతున్న హంద్రీ-నీవా కాలువను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ కేటాయించిన పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఇబ్రహీం, టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు: ప్రిన్సిపల్

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కొత్త కోర్సులు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రారంభించేందుకు అనుమతి ఇస్తూ ఉమ్మడి కళాశాల విద్యా డైరెక్టర్ డాక్టర్ సి కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. డిగ్రీ (హానర్స్), బిఎ హానర్స్ పొలిటికల్ సైన్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్, బీకాం హానర్స్ జనరల్, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బిఎస్సి హానర్స్ మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కొత్త కోర్సులు విద్యార్థులకు ఉత్తమ విద్యా అవకాశాలను అందిస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు.

టిడిపి నాయకులు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని ఆమినిగుంట పంచాయతీ సింగిరి గుంటకు చెందిన పలువురు టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో వారు వైసిపి కండువా కప్పుకున్నారు. వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నడింపల్లి దామోదర్ రాజు మండల అధ్యక్షుడు జి నాగభూషణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, పుంగనూరు నియోజకవర్గ ఎస్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు అనుప్రియ, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, కార్యదర్శి తానాథర్, నాగరాజా, బోయకొండ మాజీ ఛైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రవిచంద్ర రెడ్డి, చంగారెడ్డి, వెంకట్ రెడ్డి, షంషీర్ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంట వ్యవధిలోనే సొంతగూటికి..

తంబళ్లపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి సమక్షంలో నాగరాజు నాయుడు, నరేష్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, తదితరులకు వైసీపీ కండువా వేసి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక టిడిపి నాయకుల సాయంతో ఈ విషయం మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డికి వివరించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో మళ్లీ వారు టిడిపిలో చేరి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పు జరిగిందని ఇష్టపూర్వకంగా వైసిపిలోకి వెళ్లలేదన్నారు. ఇకపై ఇలాంటి పొరపాటు చేయకుండా టిడిపిలోనే కొనసాగుతామని పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఇకనైనా ఇలాంటి చర్యలు ఆపాలని మభ్యపెట్టడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు గిరిరాజు, జంపాల శ్రీనివాసులు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకో..!

25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 1996-2001 సంవత్సరంలో ఆరో తరగతి నుండి పద వ తరగతి వరకు చదివిన విద్యార్థిని విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒకే చోట సమావేశంలో కలిశారు. విద్యాభ్యాసం చేస్తూ విడిపోయిన వారు ఎక్కడెక్కడో చదువుకుంటూ ఉన్నత స్థాయికి ఎదిగి తమ వృత్తిలో స్థిర పడిన వారు తమ స్నేహితులతో బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని రాయల్ మహల్‌లో ఎస్‌పిఎల్ సురేష్ అధ్యక్షతన ఆదివారం ఒకే చోట కలిసి ఆనందం వ్యక్తం చేశారు. గతంలో తమకు చెప్పిన విద్య గుణపాఠం నేర్పిందని ఇప్పుడు ఉన్నత స్థాయిలో వున్నామంటే అప్పట్లో ఉపాధ్యాయులు క్రమ శిక్షణతో నేర్పిన పాఠాలే ఇందుకు కారణమని ప్రశంసించారు. అప్పుడు క్రమ శిక్షణతో తిన్న దెబ్బలు ఇంకా గుర్తు వున్నాయని మళ్లీ మీతో ఒక దెబ్బ అయినా తినాలని ఉందని అప్పటి విద్యార్థులు కట్టెలు తెచ్చి ఉపాధ్యాయుల వద్ద ఒక్కో దెబ్బతిని పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఎస్‌పిఎల్ సురేష్, సైన్స్ టీచర్ , క్లాస్ టీచర్ బాలచంద్ర నాయుడు. హెచ్‌ఎం రామానాయుడు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం రెడ్డి, సుభాషిణి, నరేంద్రబాబు, గోవింద రాజులు, అంజమ్మ, అపరంజిత, కుమార స్వామి, చంద్ర, విద్యార్థుల ఎస్‌పిఎల్ సురేష్, అప్పటి విద్యార్థిని విద్యార్థులు , కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిరసిస్తున్నామని శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సిబ్బంది మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని కంటి సమస్యలు ఉన్నవారు శిబిరంలో పరీక్షించుకుని చికిత్సలు చేయించు కోవాలన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 17 గొర్రెల మృతి, మూడు గొర్రెలకు తీవ్ర గాయాలు - రూ. రెండు లక్షల రూపాయల నష్టం



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ప్రజాశక్తి -సోమల: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 17 గొర్రెలు మృతి చెందాయని బాధితులు వాపోయారు. సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామం లోని రామచంద్ర అలియాస్ చిన్నప్ప గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తూ పూలకొండ సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద గొర్రెల మందను దొడ్డిలో ఉంచి శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా గొర్రెల మందలో గొర్రెలు, పొట్టేళ్లు మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. సమీపం లోనే కుక్కలు తచ్చాడుతూ ఉండడం చూసి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయని బాధపడ్డాడు. దాదాపు 17 గొర్రెలు పూర్తిగా మృతి చెందగా, మూడు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు రెండు లక్షల రూపాయలు మేర నష్టం వాటిల్లినట్టు సహచర రైతులకు తెలిపాడు. ప్రభుత్వం తనకు తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు. వీధి కుక్కలు, మూగజీవాలపై దాడులు చేయడం వాటిని చంపి యజమానులకు నష్టం కలిస్తున్నాయని చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డుపై వెళ్లాలంటేనే కుక్కల భయంతో వెళ్లలేకపోతున్నారు. పంచాయతీ వారు వీధికుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా చిత్రా నాయుడు జన్మదినం



జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిత్రానాయుడు

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్‌పర్సన్ చిత్రానాయుడు పుట్టినరోజు వేడుకలు చిత్తూరు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అగరంపల్లి ఆర్చి వద్ద యాదమరి మండల సింగిల్ విండో ఛైర్‌పర్సన్ చిత్రా నాయుడు పుట్టినరోజు వేడుకలను పూతలపట్టు నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు , ఐరాల నాయకురాలు లతా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందు చిత్రా నాయుడు కాణిపాకం వరసిద్ధి వినాయ కుడిని దర్శించుకున్నారు. అనంతరం భారీ కేకు లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. టిడిపి నాయకులు చిత్రా నాయుడుని పూలమాలలు, బొకేలు, దుశ్శాలు వలతో సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. యాదమరి మండల ఛైర్మన్ ఇంటి వద్ద టిడిపి నాయకు లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పుట్టినరోజు వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో తిరువణంపల్లి బాబు నాయు డు, మాజీ ఛైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మదన్ మోహ న్, నాంపల్లి సర్పంచ్ స్వర్ణ, నటరాజ, నాని, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- యాదమరి: యాదమరిలో యుటిఎఫ్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సునందన్ రెడ్డి , పాండియన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈ సంద ర్భం గా చిత్తూరు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పంటపల్లి సురేష్ మాట్లా డుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు రెహనా బేగం, జిల్లా కార్యదర్శి సురేష్, మండల గౌరవ అధ్యక్షులు ఎంఎన్ శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి సర్దార్, మండల ఆర్థిక కార్యదర్శి గిరిబాబు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సోమ శేఖర్ , ఉపాధ్యాయిని జప్రిన్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడే సంఘం యుటిఎఫ్ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. మండల కేంద్రంలో యుటిఎఫ్ జెండాను ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కోశాధికారి బాలాజీ, రైతు సంఘ జిల్లా కార్యదర్శి శంకరన్ పాల్గొన్నారు.

కనుజు వంక పరిశీలన

ప్రజాశక్తి- వికోట : 'కనుజువంక గొలుసు కట్టు వార్తకు స్థానిక నాయకులు స్పందించారు. నీరు గారిన ప్రభుత్వ లక్ష్యం.. పాలకుల నిర్లక్ష్యానికి శిథిలాలే సాక్ష్యం.. కనుజువంక పూడికతీతకు ఎప్పుడో మోక్షం..'అనే కథనం ఇటీవల ప్రజాశక్తిలో వెలువడింది. స్పందించిన అధికార పక్ష నేతలు క్షేత్ర స్థాయిలో కనుజువంకను ఆదివారం పరిశీలించారు. పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ సతీష్‌తో పాటు ఇతర టిడిపి నాయకులు గొలుసు కట్టు చెరువుల అనుసంధానానికి కుప్పం నియోజక వర్గంలోని రామకుప్పం, పలమనేరు నియోజకవర్గం లోని వికోటలో ఏర్పాటు చేసిన కనుజువంక కాలువల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ కాలువలలో పేరుకుపోయిన మట్టి, పిచ్చి మొక్కలు, చెరువు తూముల వద్ద అల్లుకున్న ముళ్లపొదలను, నీరు లేక ఎండిపోయిన చెరువులను పరిశీలిం చామన్నారు. గత టిడిపి పాలనలో రామకుప్పం, వికోట మండలాల సరిహద్దుల్లోని చెరువులను అను సంధానం చేస్తూ లక్షల రూపాయలు ప్రజాధనంతో కనుజు వంక ప్రాజెక్టును విజయవంతంగా చేపట్టామన్నారు. అప్పట్లో నీటి సౌకర్యం ఏర్పడిందన్నారు. గత ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తిగా దీన్ని విస్మరించడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని, ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువ పనులు చురుగ్గా చేపడుతున్న నేపథ్యంలో గొలుసు కట్టు చెరువుల కాలువలకు అనుసంధానం చేయాలని కోరుతున్న రైతుల డిమాండును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ముఖ్యమంత్రి ఈనెల చివరి నాటికి హంద్రీ-నీవా జలాలను కుప్పంకు తరలించేందుకు చర్యలు వేగవంతం చేసిన నేపథ్యంలో గొలుసు కట్టు చెరువుల అనుసంధాన కాలువ పనుల మరమ్మతులకు అవకాశం వుందన్నారు.



కనుజు వంకను పరిశీలిస్తున్న నాయకులు

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల లోని స్వయం భీశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణం కోసం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పలువురు వేల రూపాయలను కళ్యాణ మండపం నిర్మాణం కోసం విరాళాలు ఇవ్వగా ఆదివారం మొగిలప్ప గారి నాగమ్మ మల్లయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రామ్మూర్తి వెంకటరత్న సుబ్రహ్మణ్యం 50వేల 116 రూపాయల విరాళాన్ని ఇచ్చారు. కర్రి వెంకటస్వామి రత్నమ్మ దంపతులు 20వేల 116 లు, గన్నా సీతారామయ్య 11 వేల రూపాయల విరాళం ధర్మకర్త బివి సోమశేఖర్ కు ఆదివారం ఆలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి విద్యాసాగర్, కమిటీ సభ్యులు లింగన్న, దాతలు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విషన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ చికిత్స శిబిరానికి మండలంలోని 40 మంది కంటి రుగ్మతలు కలిగిన వారు హాజరయ్యారు. శస్త్ర చికిత్సలకు 23 మంది ఎంపికయ్యారు. ఇంతకు ముందు కంటి శస్త్ర చికిత్స చేసుకున్న వారికి కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమానికి మహతి ట్రస్ట్ అధ్యక్షులు నాగరాజు విచ్చేసి సలహాలు సూచనలు ఇచ్చారు. శస్త్ర చికిత్స నిమిత్తం చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి చికిత్స చేస్తారని, వీరందరికీ ఉచిత ప్రయాణం , భోజన వసతి, మందులు అందిస్తారన్నారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి, వారి సహాయకులకు, అన్ని ఏర్పాట్లు చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ అధినేత ఎన్ ఆర్ ఐ నాగరాజు, మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రమణ, డాక్టర్ గంగాధరం, చంద్ర, చిన్నప్ప, సహాయకులు పాల్గొన్నారు.

వైసిపి మండల మహిళా అధ్యక్షురాలుగా రమాదేవి



ప్రజాశక్తి- పాలసముద్రం: పాలసముద్రం మండల వైసిపి మహిళా అధ్యక్షురాలుగా వనదుర్గాపురం గ్రామానికి చెందిన టి రమాదేవి ని నియమించినట్లు వైసిపి కేంద్ర కార్యాలయం శనివారం పేర్కొంది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తనని మహిళా అధ్యక్షురాలుగా నియమించినందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపా లక్ష్మికి మండల పార్టీ అధ్యక్షులు ఎస్ తులసి యాదవ్‌కి ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై కుటుంబ ప్రభుత్వాన్ని నిలదీస్తూ సామాన్యులకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యకర్తలకు ఈ ప్రభుత్వంలో బాధలకు గురవుతున్న ప్రజలకు తన వంతు రక్షణ కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, పాత బస్టాండ్, టవర్ క్లాక్ సెంటర్లో ఆది వారం వామపక్షాల నాయకులు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల పై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, ఆదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాభిప్రాయ సంతకాలు సేకరణ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సి.పి.ఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడు తూ సోమవారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాను జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, రమణ య్య, అడపాల ప్రసాద్, పామంజి మణి, సుబ్బయ్య, ఏంబేటి చంద్రయ్య, వి.భాస్కర్ రెడ్డి, గండికోట మధు, చంద్రయ్య, సి.పి.ఐ నాయకులు సి.హెచ్.ప్రభాకర్, సి.వి.ఆర్. కుమార్, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

53వ రోజూ నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావు ని బదిలీ చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సస్పెండ్ చేయాలని, డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 53వ రోజుకు చేరాయి.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- కానరాని అధికారుల పర్యవేక్షణ
- నిధులు గంగ పాలేనా?
- ఊరికి దిష్టి...ఈ నీటి తొట్టెలు



ప్రజాశక్తి -ఏర్పేడు : రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి, వాటి ఆరోగ్య ప్రమాణాలను పెంచడానికి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ నిధులతో పశువుల నీటి తొట్టెలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలంలో 40 పంచాయతీల అవసరాలకు అనుగుణంగా ప్రతి పంచాయతీలో ఒకటి లేదా రెండు నిర్మించుకునేందుకు 75 పశువుల నీటి తొట్టెలకు ఆమోదం తెలిపింది. ఒక్కో నీటి తొట్టె నిర్మాణం రూ. 38401 వ్యయంతో అనగా 1193 కూలీలు నిర్మించబడ్డాయి. అయితే అవసరమైన ప్రదేశాలను గుర్తించి ఈ నీటి తొట్టెల నిర్మాణాలను చేపట్టాలి కానీ నీటి సదుపాయం లేని చోట నిర్మాణాలు చేపట్టిన దృశ్యాలు మండలంలో పలుచోట్ల దర్శనమిస్తున్నాయి. దీంతో నిధులు వృథాఅయ్యాయని విమర్శలు వస్తున్నాయి. మరికొన్నిచోట్ల నీటి తొట్టెలు ఖాళా మద్యం బాటిళ్లు, బీరు సీసాలు, ప్లాస్టిక్ వస్తువులతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటివరకు 30 తొట్టెల నిర్మాణం మాత్రమే చేపట్టడం గమనార్హం. పంచాయతీరాజ్, ఎంఎన్ఆర్జిఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులు పంచాయతీ ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ముందుకు రాక.. నిర్మాణాలు చేపట్టక..

గతేడాది జూలైలో కూటమి ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి నిధులతో గోకులం షెడ్ల నిర్మాణాలకు పెద్దపీట వేసింది. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టినా బెనిఫిషరీ నిధుల విడుదల ఆలస్యంగా జరిగింది. అయితే ఈ ఏడాది మరో పథకం మూగజీవాల దాహార్తిని తీర్చడానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ గ్రామస్థాయిలోని కూటమి కార్యకర్తలే కాంట్రాక్టర్లై కొంతమేరకు నిర్మాణాలు పూర్తిచేనా, మరికొందరు ముందుకు రాక పూర్తిస్థాయిలో ఈ పథకం అమలు గాని పరిస్థితి నెలకొంది.

కానరాని అధికారుల పర్యవేక్షణ..

కొన్ని గ్రామాలలో ఈ పథకాన్ని ఛాలెంజ్‌గా చేపడితే మరికొన్ని గ్రామాలలో తూ..తూ మంత్రంగా చేపట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనం, కందాడు పంచాయతీలోని సదాశివపురంలో నీటి సదుపాయం లేని చెరువు కట్టపై నిర్మించారు. అమందూరులో సంత మార్కెట్ వద్ద నీటి తొట్టెను నిర్మించారు, కానీ నీటి కనెక్షన్‌ను మరిచారు. బాలకృష్ణాపురం గ్రామంలో వ్యాసాశ్రమం సమీపాన స్మశాన వాటికలో నీటి తొట్టెను నిర్మించారు, కానీ నీటి సదుపాయం లేక వన్యప్రాణాలకు సైతం దాహార్తిని తీర్చలేని దుస్థితి. ప్రక్కనే చేతి బోరు వున్న మరమ్మతుకు గురాయింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరికొన్ని సమస్యలు వెలుగులోకి వస్తాయి.

సద్వినియోగం చేసుకోండి

మండలానికి 75 పశువుల నీటి తొట్టెలు మంజూరు అయ్యాయి. 30 మాత్రమే ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టారు. మిగతా 45 నిర్మించడానికి పంచాయతీలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. నిధులు త్వరితగతిన విడుదలవుతున్నాయి.

- తిరుమండ్యం సుజాత, ఏపీవో, ఏర్పేడు

కాకాణి పూజితతో సాయి ప్రసాద్ రెడ్డి భేటి



ప్రజాశక్తి -కోట : వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితా రెడ్డితో గూడూరు నియోజకవర్గానికి చెందిన వైసిపి యూత్ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి ఆదివారం భేటి అయ్యారు. వైసీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితా రెడ్డికి అభినందనలు తెలిపారు. అదేవిదంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి లాగా కష్టపడి పనిచేసి, ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు.

కాపుగున్నేరి పీఏసీఎస్ చైర్మన్‌గా బత్తిరెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరి ప్రాథమిక సహకార పరపతి సంఘం చైర్మన్‌గా టిడిపి సీనియర్ నేత, చల్లపాలెం మాజీ సర్పంచ్ వంకాయలపాటి బత్తి రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్రంలోని పలు సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించారు. వీరు ఆరు నెలల కాలం పాటు సేవలందిస్తారు. ఈ క్రమంలోనే కాపుగున్నేరి సింగిల్ విండో చైర్మన్ గా వంకాయలపాటి బతిరెడ్డికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అవకాశం కల్పించారు. బత్తిరెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. రెండు పర్యాయాలు చల్లపాలెం సర్పంచ్‌గా, రెండు పర్యాయాలు శ్రీకాళహస్తి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా, ఓ పర్యాయం నెహ్రూ జూలాజికల్ పార్క్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సంఘం, రైతుల అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తామని బత్తిరెడ్డి తెలిపారు.

నేడు చంద్రగిరిలో ఎమ్మెల్యే నాని పర్యటన

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు పనపాకంలో నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం చంద్రగిరి, వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రీజినల్ కోడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ ఘట్టం

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి గ్రామంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధనవధ కార్యక్రమం వైభవంగా జరిగింది. దుర్యోధన వధ ఘటం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం

ఎన్ ఆర్ కమ్మపల్లి గ్రామాలలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అగ్నిగుండంపై అగ్గి నిప్పులను పరిచి అగ్ని గుండానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి, అమ్మవారి కంకణాల కట్టుకొని, వేప పత్రి చేతుల పట్టుకుని శ్రీ ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెత్తిన పెట్టుకుని ఓం శక్తి నామ స్మరణలు, నడుమ153 మంది పైగా అగ్నిగుండ ప్రవేశం చేసినట్లు ధర్మకర్తలు తెలిపారు.

బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు-చెన్నై బైపాస్ ఫ్లైఓవర్‌పై ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో నగిరి నుండి పుత్తూరు వైపు వస్తున్న బైక్, పుత్తూరు నుండి వెళ్తున్న మరో బైక్‌ను ఫ్లైఓవర్ మధ్యలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నగిరి వాస్తవ్యులు తిరునాకరుసు (25), గుణశేఖర్ (24), కేబీఆర్ పురం వాస్తవ్యులు రాజేంద్ర (30), వినోద్ కుమార్ (25)లు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వారిని పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఫైవోర్‌పై లైటింగ్ లేకపోవడంతో చీకట్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, లైట్లు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతి జిల్లా అటవీ శాఖ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు

- శేషాచలం తీర్థాలకు భక్తుల అనుమతిపై అధ్యయనం
- ప్రజాశక్తితో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ ఆనంద్

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా అటవీ శాఖ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, శేషాచలం అటవీ పరిధిలో ఉన్న సుందరమైన జలపాతాలు, అడవిలో ఉన్న దేవాలయాల సందర్శనకు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి వివేక ఆనంద్ ప్రజాశక్తికి తెలిపారు. జిల్లా పరిధిలో అటవీ శాఖ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వన్యప్రాణుల సంరక్షణ, చిరుతపులుల సంచారం వంటి అంశాలపై ప్రజాశక్తి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక ఆనంద్ తో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పలు అంశాలను ప్రజాశక్తికి ఆయన వివరించారు.

ప్రజాశక్తి: శేషాచలం అటవీ పరిధి తిరుపతి జిల్లాలో సందర్శనీయ ట్రెక్కింగ్ లకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి?, నిబంధనలు అతిక్రమిస్తే తీసుకునే చర్యలను వివరించండి?

అధికారి: తిరుపతి జిల్లా పరిధిలో శేషాచలం అటవీ ప్రాంతంలో చాలా సుందరమైన సందర్శనీయ జలపాతాలు ఉన్నాయి. సాహసోపేత సందర్శనలు చేసే వారికి అటవీశాఖ షరతులతో కూడిన అనుమతులను మంజూరు చేస్తుంది. అనుమతులు పొందిన వారు ఆయా ప్రాంతాలను సందర్శించి వెనుదురగాల్సి ఉంటుంది. కానీ అటవీ సందర్శనీయ ప్రదేశాలను చూపిస్తామంటూ కొంతమంది ట్రెక్కర్స్ ఇటీవల సందర్శకుల నుండి అధిక మొత్తంలో నగదును వసూలు చేసి అటవీశాఖ అనుమతించిన ప్రాంతాలు కాకుండా అతిక్రమించి ముందుకు పోవడం జరిగింది. దీనిని అటవీశాఖ తీవ్రంగా పరిగణించి అట్టివారికి జరిమానాలు విధించడం జరిగింది. సాహసోపేతమైన సందర్శనలు అటవీ ప్రాంతంలో చేయడం నేరం. ఇందుకు అటవీ శాఖ చట్టం ఎటువంటి పరిస్థితుల్లో ఒప్పుకోదు. నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ రిజర్వ్ ఫారెస్ట్ లో నడుచుకోవాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: తిరుమలలో పుణ్య తీర్థాలకు సాధారణ రోజులలో కూడా భక్తులను అనుమతించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా?

అధికారి: తిరుమల పుణ్యక్షేత్రం చుట్టూ ఉన్న శేషాచలం అడవిలో ఏడాదిలో ఎక్కువమంది సందర్శించే తుంబూరు తీర్థం, రామకృష్ణ తీర్థం కు వెళ్లడానికి సాధారణ రోజుల్లో కూడా భక్తులు అనుమతించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాము. ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సిసిఎఫ్ సెల్వ కుమార్ తో కలిసి పుణ్య తీర్థం సాధారణ రోజుల్లో కూడా భక్తులు అనుమతించే పరిస్థితులను అధ్యయనం చేశారు. కాకపోతే ఎంతో సాహసోపేతమైన ఈ ప్రయాణానికి సాధారణ భక్తులను అనుమతించడానికి ఎటువంటి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో పరిశీలిస్తున్నాం. తుంబూరు తీర్థం, రామకృష్ణ తీర్థం వెళ్లి రావడానికి జిపిఎస్ పాయింట్లు గుర్తించడానికి సలహాలు చేస్తున్నాం. దాదాపు అడవి, కొండల మధ్య ప్రయాణం కనుక సందర్శించే భక్తుల భద్రతకు, అదే సమయంలో వన్యప్రాణుల సంరక్షణకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా నిర్ణయాలు తీసుకోవడానికి ఇంకనూ సమన్వయ సమావేశాలను నిర్వహిస్తాం.



ప్రజాశక్తి: అలిపిరి మార్గంలో క్రమేపి చిరుత పులి సంచారంపై ఇటువంటి నిర్ణయం తీసుకున్నారు?

అధికారి: అలిపిరి నుండి చెర్లోపల్లి మార్గంలో టాటా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద తరచూ చిరుతపులి కనిపించడం, ఎన్నడూ లేని విధంగా ద్విచక్ర వాహనదారుడుపై దాడికి ప్రయత్నించడం ఇప్పుడే చూస్తున్నాం. సాధారణంగా చిరుతపులులు వాహనాలపైకి దాడికి వెళ్ళవు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద చిరుత పులి రెండు వారాలకు ఒకసారి అడ్డుగా రావడం జరుగుతుందని, ఈ విషయాలను ట్రాప్ కెమెరాల ద్వారా నిర్ధారించాము. అయితే సమీపంలోని విశ్వవిద్యాలయాల హాస్టల్స్ వద్ద విడిచిపెట్టిన ఆహారాన్ని తినడానికి వస్తున్న కుక్కలను వేటాడడానికి చిరుతపులులు వస్తున్నాయని గుర్తించి ఆయా ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలని వారికి సూచించడం జరిగింది. అదేవిధంగా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ కూడా ప్రత్యేక చొరవ తీసుకొని అలిపిరి నుండి చెర్లోపల్లి మార్గంలో ఎటువంటి తినుబండారాలను అమ్మకాలకు ఉంచకుండా, చెత్తాచెదారాలను వెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ముందుకు వచ్చారు. అయితే ఈ మార్గం టీటీడీ పరిధిలో ఉన్నందున టిటిడి వారు కూడా తగిన సహకారాన్ని అందిస్తామని ఇప్పటికే తెలిపారు. రాబోవు రెండు వారాలలో చిరుతపులిని బంధించడానికి మూడు బోన్లను ఇప్పటికే ఏర్పాటు చేసి ఉన్నాం.

ప్రజాశక్తి: ఏనుగుల గుంపుల నుండి రైతులకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: శేషాచలం అటవీ పరిధిలో ఏనుగుల గుంపులు ఉన్నాయి. కాకపోతే అడవి మధ్యలోనే దాదాపు 18 ఏనుగులు వాటి సంతతితో కలిసి అక్కడే ఉన్నాయి. ఆహార అన్వేషణలో భాగంగా ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఏనుగులు గుంపు అటవీ సరిహద్దు ప్రాంతాలలోని పంట పొలాలను ధ్వంసం చేస్తూ ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టాన్ని కలిగిస్తున్నాయి. వీటిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కర్ణాటక రాష్ట్రం నుండి కుంకి ఏనుగులను ఏపీకి రప్పించారు. వీటికి మన అటవీ ప్రాదేశిక ప్రాంతాలపై అవగాహన తెప్పించిన తరువాత ఆపరేషన్ కు వినియోగిస్తాం. రైతులు గాని, అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు గాని ఏనుగుల గుంపు కనిపిస్తే వాటిని భయభ్రాంతులకు గురి చేయడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో దిగకూడదు. దీనిపై కొన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకొని ఏనుగుల దాడుల నుండి రక్షణ కల్పించడానికి పనిచేస్తున్నాం.

ప్రజాశక్తి: తిరుపతి జిల్లాలో రక్షిత అటవీ ప్రాంతం ఎంత మేర ఉంది?

అధికారి: శేషాచలం అడవులు ఐదు జిల్లాలకు విస్తరించి ఉన్నాయి. ఇందులో తిరుపతి జిల్లాలో రక్షిత అటవీ ప్రాంతం 2.8 మిలియన్ హెక్టార్ల పరిధిలో విస్తరించి ఉంది. జిల్లా అటవీ శాఖ పరిధిలో అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పచ్చదనం పెంపు ఇలా అనేక కార్యక్రమాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నాం. త్వరలో వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి ప్రత్యేక డీఎఫ్ఓ ను నియమించే అవకాశం ఉంది. అప్పుడు మరింత పటిష్టంగా అటవీశాఖ కార్యకలాపాలను నిర్వర్తించడానికి వీలు కలిగించినట్లు అవుతుంది.

చేనేతల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చేనేతల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గూడూరు మండల పరిధిలోని చెన్నూరులో నేతన్నలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు ప్రతి సంవత్సరం చేనేత భరోసా పథకం ద్వారా 25 వేలు రూపాయలు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. చేతి మగ్గాలు నేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలు నేసే వారికి 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. చేనేతల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు కటికాల శ్రీనివాసులు, పడాలరత్నయ్య, 24 సొసైటీ అధ్యక్షుడు కరుణాకర్, రవీంద్ర రెడ్డి, రాజనాల, శ్యామల, శైలజ, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత మానవాళికి గొప్ప నిధి



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఇండోర్ స్టేడియంలో శ్రీఅన్నమయ్య డాన్స్ అకాడమీ, అపుస్మా సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణం వందే జగద్గురుం అనే కార్యక్రమం సంస్కృత సప్తాహంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుప్రసిద్ధ జ్యోతిష విద్వాంసులు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి విచ్చేసి కృష్ణం వందే జగద్గురుం కార్యక్రమం థీమ్‌ను వివరించారు. విశ్వవిద్యాలయం ఇన్చార్జి రిజిస్ట్రార్ కంభంపాటి సాంబశివమూర్తి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ మలేషియా ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ డా.నారాయణ స్వామిలు భగవద్గీత విశిష్ఠతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాగ్వర్ధిని పరిషత్ కోఆర్డినేటర్ డా.భరత్ భూషణ్ రథ్, నిర్వాహకులు డా.శ్రీరాంబాబు, అనువాద విభాగం అధ్యాపకులు ఎపిఆర్ఓ డా. కనపాల కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవి బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండ ప్రవేశం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని శ్రీ ద్రౌపది దేవి సమేత శ్రీ ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఉదయం కల్పవృక్ష వాహనాన్ని విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో దేవాలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం కార్వేటి నగరంలోని శ్రీ ద్రౌపది దేవి తీర్థంలో భక్తులు తీర్థస్నానం చేసి, పీతాంబర, గంధం, మాల్యాలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ తూర్పు మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని నిమ్మపండ్లు, పుష్పగుచ్ఛాలతో పరీక్షించి, అగ్నిగుండంలో ప్రవేశపెట్టారు. అనంతరం ఘనంగా ఆలయంలోకి తిరిగి తీసుకువచ్చారు. అనేక అవమానాలు ఎదుర్కొన్న ద్రౌపది అమ్మవారు తన పవిత్రతను నిరూపించుకోవడానికి అగ్నిప్రవేశం చేశారని, ఈ ఘట్టాన్ని తిరునాళ్లలో అగ్నిగుండ ప్రవేశం రూపంలో నిర్వహించడం ఆనవాయితీ అని నిర్వాహకులు తెలిపారు. అగ్నిగుండ ప్రవేశం సమయంలో అమ్మవారిని దర్శించడం ద్వారా పాపక్షయం జరుగుతుందని, కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. **స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు..** తిరునాళ్లలో స్కౌట్స్ అండ్ గౌడ్స్ భక్తులకు సేవలందించారు. ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమంలో భక్తులను క్యూ లైన్లలో పంపడం, నీరు అందించడం వంటి సహాయక చర్యలు చేపట్టారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ సెక్రెటరీ విజయ్ కుమార్, అడల్ట్ లీడర్ మునీందర్ రెడ్డి, స్కౌట్ మాస్టర్ జయప్రకాష్, గజరాజన్, అశోక్ కుమార్ గైడ్స్ లీడర్ శైలజ, మహాలక్ష్మి, భాను తదితర జెడ్పి హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ అనుమానితులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

నేడు ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే

ధర్నాను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రజలను విద్యుత్ చార్జీలు, అదానీ స్మార్ట్ మీటర్లుతో నిలువు దోపిడీకి నిరసన తెలుపుతూ సిపిఐ, సిపిఎం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ప్రజా వేదిక నేతృత్వంలో సోమవారం ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ పార్కులో పాదాచారులకు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జరిగే పోరాటంలో ప్రజలు పాల్గొనాలని కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై మోపిందని, ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండి బాదుడే బాదుడు అనే కార్యక్రమాలు చేసి, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమని, ఇప్పటికే భారంగా ఉన్న చార్జీలు తగ్గిస్తామని, ఎన్నికల ప్రణాళికల హామీలు ఇచ్చి, నేడు ఆ హామీని విస్మరించడం, ఒడ్డు చేరాక తెప్ప తగలేసి చందాన ఉందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని చంద్రబాబు సుపుత్రుడు లోకేష్ బాబు ఆనాడు పిలిపిచ్చారని, నేడు అదే స్మార్ట్ మీటర్లు ఇంటింటికి వచ్చి బిగిస్తువుంటే లోకేష్ బాబు నోరు మెదపకుండా ప్రజలను నమ్మకద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి పాలకులు పూనుకుంటున్నారని, ఆదాని కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు అని, విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు, కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమని పేర్కొన్నారు. ఈ మీటర్ ఖర్చు సింగల్ ఫేస్‌కు 9000, త్రీ ఫేస్ కి 17,000, 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో జనం నుండే వసూలు చేస్తారని, తర్వాత మళ్లీ మీటర్ మార్చుకోవాల్సిందే, మళ్లీ డబ్బు కట్టాల్సిందే గంట గంటకు రీడింగ్ తీస్తారని, పగటి కంటే రాత్రి వాడిన కరెంటుకు అధిక బిల్లులు వేస్తారని, వేసవికాలంలో ఎక్కువ రేట్లు వసూలు చేస్తారని తెలిపారు. అదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించే వరకు, ట్రూ ఆఫ్ చార్జీలు విధానాన్ని తొలగించే వరకు, అదనపు భారాలు తగ్గించేవరకు, సెకీ ఒప్పందాలు రద్దు చేసే వరకు, దశల వారి పోరాటం చేస్తామని తెలిపారు. సోమవారం ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే పోరాటంలో ప్రజలందరూ సహకరించి ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, పద్మనాభరెడ్డి, ప్రమీల, ప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవకోన ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ఆరణి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జీవకోన ప్రాంతాన్ని ప్రశాంతతకు మారుపేరుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. జీవకోన, జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే, ఎస్పీ హర్షవర్ధన రాజు, డిఎఫ్ఓ వివేక్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవకోనలో గత ఐదేళ్ళ కాలంలో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోవడంతో ఎన్నికల సమయంలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో, అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. జీవకోన ప్రాంతానికి ఉన్న చెడ్డ పేరు పోవడానికి ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పని చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అన్నా రామకృష్ణ, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఏఎస్పీ రవిమనోహరాచ్చారి, డిఎస్పీ భక్తవత్సలం, సిఐ రామ్ కిషోర్, కార్పోరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, దూది కుమారి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలు



విలేకరులతో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిలకు కౌంట్ డౌన్ మొదలైందని, వారు కూడా జైలుకు వెళ్లక తప్పదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి స్పష్టం చేశారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి స్వర్ణముఖి నదిలో సుమారు తొమ్మిది ఎకరాలు కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించుకొని ఆక్రమించుకున్నారన్నారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ పేరుతో టిడిఆర్ బాండ్ల అవినీతిలో తండ్రి, కొడుకుల పాత్ర ఉందని, విజిలెన్స్ విచారణ పూర్తయిందని త్వరలో నివేదిక రానుందని చెప్పారు. టిటిడి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కరుణాకర్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగంలో అనేక అనుమతులు ఇచ్చి కోట్లాది రూపాయలు మామూళ్లు తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు తిరుపతిలో పారిశుధ్యం సరిగా లేదని, కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత అభివృద్ధి ఆగిపోయిందని విమర్శలు చేయడం తగదన్నారు. టీటీడీ నిధులు ఆనాడు స్వాహా చేయాలనే ఉద్దేశంతోనే పారిశుధ్యం కోసం 100 కోట్ల నిధులు వెచ్చించడానికి ప్రయత్నించారని అయితే అది సాధ్యం పడలేదన్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై ఎగిరెగిరి పడ్డారని ఆయన మద్యం స్కాంలో ఇరుక్కుని జైల్లో ఉన్నారన్నారు. కరుణాకర్ రెడ్డి పేరు కూడా మద్యం స్కాంలో బయట వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఆయన అనుచరుడు తూకేకుల ఈశ్వర్ రెడ్డి ద్వారా ఆయన లబ్ధి పొందారని, ఆ విషయం కూడా త్వరలో బయటకు వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మునికృష్ణ, మాజీ మంత్రి పరసారత్నం, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల): తిరుపతి జిల్లా, పాకాలమండలం, వల్లివేడు పంచాయతీ, హరిజన వాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఆదివారం వైభవంగా జరిగింది. విగ్రహ వ్యవస్థాపకులు స్వర్గీయ సుబ్రహ్మణ్యం, గోవింద్, పరదేశి, బాబు సహకారంతో నిర్మించిన విగ్రహాన్ని ముఖ్య అతిథులు పి.ఎస్.ఎన్.మూర్తి, ఎన్.సిద్ధోజీరావు ప్రారంభించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఓ.మైక్రో ఇరిగేషన్ ఎ.కృష్ణమూర్తి, ఎ.గోవింద్, టి.బాబు, టి.పరదేశి, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శంకరంబాడి జయంతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శంకరంబాడి సుందరాచారి 111వ జయంతి సంధర్భంగా వేమన విజ్ఞానకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వేమన విజ్ఞానకేంద్రం ప్రధానకార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" పాటను రాసిన మహాకవి శంకరంబాడి సుందరాచారి అని, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానకేంద్రం నాయకులు పంచముఖేశ్వర్ రావు, గురునాధం, బాలాజీ చౌదరి, రెడ్డెప్ప, రఫీ, సాహితీ వేత్తలు అంకమనాయుడు, యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

మల్లకుప్పం శేఖర్‌కు ఆత్మీయ సత్కారం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు మల్లకుప్పం శేఖర్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక కొర్లగుంట, సంజీవ్ గాంధీ కాలనీ శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ ఫౌండర్ తంగవేలు మేస్త్రి మాట్లాడుతూ మా యూనియన్ అధ్యక్షుడైన మల్లకుప్పం శేఖర్‌కి బిజెపిపార్టీలో తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. మల్లకుప్పం శేఖర్ మాట్లాడుతూ పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నన్ను నమ్మి నాకు ఈ పదవి బాధ్యతలు ఇచ్చిన పార్టీని నా శక్తి మేర బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం కార్మికులందరూ ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లాభక్ష, రమణ, జగన్నాథ, మధు యాదవ్, బాలరాజు, నాగేంద్ర కుమార్, మధు, సాయి ప్రసాద్, దీన దయాలనాయుడు, మునిరాజా, వెంకటరమణ, కృష్ణమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అద్దెకు తీసుకున్నాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వ్యాయామశాల ఏర్పాటు చేయాలని అమెరికాలో ఉన్న తులసీరామన్ నుండి మంగళం సప్తగిరి కాలనీలో ఉన్న భవనం అద్దెకు పొందామని, అయితే తులసి రామన్ తమ్ముడు నరేంద్ర కవేటి ఉద్దేశపూర్వకంగా తాము దాడులు చేశామని చెప్పడం పూర్తిగా సత్య దూరమని లీజు పొందిన వ్యక్తి ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మంగళం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఓ కమర్షియల్ బిల్డింగ్‌లో అద్దె భవనానికి సంబంధించి రెండు గ్రూపుల వారు వేరువేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు జీపీఏ హోల్డర్ గా కొనసాగి, తానే ఓ స్టార్టపు కంపెనీకి అగ్రిమెంటు రాయించిన నరేంద్ర కవేటి వారి వ్యాపార భాగస్వామ్యులతో కలిసి వారు ప్రారంభించిన స్టార్టప్ కంపెనీ ఫర్నిచర్‌ను ధ్వంసం చేసుకొని మంగళం యువకులపైకి నెట్టేయడం అబద్ధమన్నారు. కాగా ఇదే విషయమై కోవర్క్ స్టార్ట్ అప్ కంపెనీ ప్రారంభించిన రామి రాయ్ రెడ్డి, నరేంద్ర కవేటి తాము ప్రారంభించిన స్టార్టప్ కంపెనీ నిర్వహించుకోవడానికి సమయం ఉన్నా కానీ దురుద్దేశపూర్వకంగా తమ ఫర్నిచర్ ధ్వంసం చేసి ఆస్తి నష్టం కలిగించారని, దీనిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేసేమన్నారు. తులసి రామన్ 2024 డిసెంబర్లో తనపై ఇచ్చిన జీపీఏను రద్దు చేశారని నరేంద్ర కవేటి తెలిపారు. తులసిరామన్‌ను వ్యాపారంలో భాగస్వామిగా చేర్చుకోకపోవడం కారణం చేత ఇటువంటి దుశ్చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. దీనిపై ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలి: చీర్ల కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఇందుకుగాను సెప్టెంబర్ 1న పెన్షన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఇప్పటివరకు అనేక కార్యక్రమాలను నిర్వహించమన్నారు. సిపిఎస్ ఉద్యోగి మరణిస్తే అటు తరువాత ఆ ఉద్యోగికి సంబంధించిన బెనిఫిట్స్ అందేలా కూటమి ప్రభుత్వంలోని సీఎం నారా చంద్రబాబు నాయుడు చొరవ చూపారన్నారు. ఇంకనూ సిపిఎస్ ఉద్యోగుల భద్రతకై రెండు జీవోల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కానీ సిపిఎస్ రద్దుకై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, చర్చలకు ఆహ్వానించలేదని, పిఆర్సి, డిఎల ఊసే లేదన్నారు. సిపిఎస్ రద్దు హామీ గుర్తుచేస్తూ వేలాదిమంది సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వెన్నుపోటు పొడిచిన దినం సెప్టెంబర్ 1న విజయవాడ, గుంటూరు మధ్య పెన్షన్ మార్చు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీసిపిఎస్ఈఏ తిరుపతి జిల్లా అధ్యక్షులు వంకీపురం పవన్, మురళి, భరత్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఒకే రైలు రెండు టికెట్లు
గందరగోళంగా తిరుమల ఎక్స్ ప్రెస్ ప్రయాణం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గుంతకల్లు, కడప మీదుగా తిరుపతి, తిరుమల వెళ్ళే ఎక్స్ప్రెస్ రైలు నెంబర్ 17487/17488 (తిరుమల ఎక్స్ప్రెస్). ఈ రైలు విశాఖపట్నం నుండి కడప వరకు నడుస్తుంది. గుంతకల్లు నుంచి కడప, తిరుపతి మీదుగా విశాఖకు వెళ్లే తిరుమల ఎక్స్ప్రెస్ రైలులో ప్రయాణికుడు గమ్యం చేరుకోవడానికి ఒకే రైలులోనే రెండు టికెట్లు కొనాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రయాణి అయోమయానికి గురవుతున్నారు. గతంలో తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప నుంచి తిరుపతి, విశాఖ మీదుగా వెళ్లేది. తిరుపతికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం గత నెల 30 నుంచి గుంతకల్లు వరకు పొడిగించారు. రైలును కడప–గుంతకల్లు మధ్య ప్రత్యేక ప్యాసింజరు రైలుగా, కడప నుంచి కొర్బా వరకు ఎక్స్ప్రెస్ రైలుగా నడుపుతున్నారు. తిరుపతికి వెళ్లే ప్రయాణికులు రైల్లో గుంతకల్లు –కడప మధ్య జనరల్ టికెట్ తీసుకుని ఆ తర్వాత ఎక్స్ప్రెస్ టికెట్లను కొనాల్సి వస్తోంది. ఈ క్రమంలో టికెట్లకు కడప రైల్వే స్టేషన్లో దిగాల్సి వస్తోంది. ఇక్కడ రైలు అరగంట ఆగుతుంది. ఈ క్రమంలో టికెట్లు దొరకని పరిస్థితిలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జనరల్ టికెట్లు తీసుకున్న ప్రయాణికులకు గుంతకల్లు –కడప మధ్య జనరల్ బోగీలతో పాటు స్లీపర్లో కూడా ప్రయాణించడానికి వెసులుబాటును కల్పించారు. రైలు గుంతకల్లు నుంచి తిరుపతి మీదుగా వెళుతుందని ప్రయాణికులకు సూచించే విధంగా బోర్డులో మార్పులు చేయకపోవడంతో చాలా మంది రైలును గుర్తించలేక పోతున్నారు. దీనిపై రైల్వే అధికారులను సంప్రదించగా టికెట్లను కొనుగోలు చేసే విషయంలో ఉన్నతాధికారులు మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రైలును గుంతకల్లు వరకు పొడిగించి పరీక్షిస్తున్నామనీ, త్వరలో రైలు నేమ్ బోర్డులో మారుస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే వాకర్స్ లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రజల ఆరోగ్యమే వాకర్స్ లక్ష్యమని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాజు తెలిపారు. ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 క్యాబినెట్ సమావేశం వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ డా.రవిరాజు గవర్నర్ రావిళ్ల మాధవనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ డా.రవిరాజు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు నడక దోహదపడుతుందని తెలిపారు. తరువాత రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 క్యాబినెట్ సమావేశం తిరుపతిలో జరగడం చాల ఆనందంగా ఉందన్నారు. అనంతరం నారాయణాద్రి హాస్పిటల్ వారు వాకర్స్ సంఘాలకు బిపీ తెలిపే సుమారు రూ.2000/- విలువ గల మీటర్‌ను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రావిళ్ల మాధవ నాయుడు, ఎలెక్ట్ గవర్నర్ రామచంద్ర రెడ్డి, కోనేటి రవిరాజు, మనోహరన్, వినాయగం, వేణుగోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, నెలవాయి, కుమార వెంకటాపురం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు వైయస్సార్సీపి నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి బాబు చేస్తున్న మోసాలని వివరిస్తూ, క్యూఆర్ కోడ్ ప్లకార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చి నాయుడు కండ్రిగ వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు మణి నాయుడు, తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, వైయస్సార్సీపి ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ గోపాల్ రెడ్డి, వైయస్సార్సీపి సర్పంచులు ఎంపిటీసీలు వైయస్ఆర్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో ఆదివారం ఉదయం తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు గీతమ్మ, సీనియర్ నాయకులు వేణుగోపాల్, మురళి, తుంబురు బాలాజీ, కరవాటి బాలాజీ, పుత్తూరు మండల నాయకులు ఎఫ్ డబ్ల్యూ ఎస్ డైరెక్టర్ విజయనాగు, యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ కన్వీనర్ నరేష్, మునిరత్నం, పి.చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్, నాగరత్నం, మునెయ్య, నారాయణవనం మండల నాయకులు మునిరత్నం, ప్రతాప్, పిచ్చాటురు నాయకులు మదన్ మోహన్, కరవాటి బాలాజీ, ప్రకాష్, సుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం చంద్రగిరిలో యుటిఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు రామిరెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం యుటిఎఫ్ పోరాటాలు చేసి పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి ధనంజయ, ఉపాధ్యక్షులు హరికుమార్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, కోశాధికారి చెంచయ్య, శ్రీరాములు, హరిప్రసాద్, కృష్ణమూర్తి రెడ్డి, సిద్దయ్య, రాజేంద్ర, దేవేంద్ర రెడ్డి, ఉత్తన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో ఇవ్వాలి : సిఐటియు



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: ఇంఫిలూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాంబట్టు (సాక్స్ కంపెనీ) గత కొంత కాలంగా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని సిఐటియు మండల కార్యదర్శి కే.లక్ష్మయ్య తెలిపారు. హెచ్‌ఆర్‌తో మంతనాలు జరిగినా పెద్దగా మార్పులేదన్నారు. ఇంఫిల్ కంపెనీ ఉద్యోగులు వేరే రాష్ట్రాలలో వేతనాలు సంక్షేమం కోసం ఉద్యమాలు చేస్తున్నారు. మాంబట్టులో కార్మికులు సంఘటితంగా లేకపోడం, కార్మిక అధికారులు ఉదాశీనంగా ఉండడం, రాజకీయ నాయకులు వారి సహజ ధోరణిలో కంపెనీ కార్మికుల ఊసెత్తక పోవడం, వెరసి కార్మికుల పరిస్థితి గందరగోళంగా వుంది. సీఐటీయూ చొరవ చూపినా మానేజ్మెంట్ సంహకరించడం లేదు. పరిస్థితి ఎంత ఆందోళనగా ఉందంటే కార్మికుల తమ వేతనములో నుంచి తగ్గించిన భవిష్యనిది (పిఎఫ్) జనవరి 2025 నుండి కంపెనీ జమచేయలేదు. ఈ ఉల్లంఘనను సీఐటీయూ సిపిగ్రామ్స్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ పీఎఫ్ జమ చేయకపోవడం వాస్తవమేనని కేంద్ర ప్రభుత్వ విభాగం నిర్ధారించింది. పి.ఎఫ్ అధికారులు ఈ ఉల్లంఘనకు సమాధానం ఏడు రోజుల లోపల తెలియజేయాలని లేదంటే తగు చర్య ఎందుకు తీసుకోకూడదో తెలియ జేయమని కంపెనీకి నోటీస్ ఇవ్వడం జరిగింది. యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కోరారు.

ఆకుకూరలు, పండ్లతో ఆరోగ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆకుకూరలు పండ్లు తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని పతాంజలి యోగ ఫిట్ కైలాష్ సింగ్ పురోహిత్, రఫీ హిందూస్తాని తెలిపారు. ఆదివారం పతాంజలి యోగ సమితి ఆధ్వర్యంలో అసిస్టెంట్ యోగా టీచర్ శిక్షణ తరగతులు, అమృత ఆహారం కార్యక్రమం నిర్వహించారు. పతాంజలి అసిస్టెంట్ యోగ టీచర్ శిక్షణా తరగతులు మంచి నీళ్లగుంట వెనక ఉన్న విద్యోదయ స్కూల్ ఆవరణంలో జరుగుతున్నాయన్నారు. కాకరకాయతో జిలేబి, బూడిది గుమ్మడికాయతో పెరుగన్నం, బీట్రూట్‌తో హల్వా, వేరుసెనగ గింజలు, పప్పు దినుసులు, క్యారెట్, ఖర్జూరం వంటి ఆహారం తీసుకుంటే మనిషి ఆయుష్షు పెరుగుతుందన్నారు. మాంసాహారం శ్రేయస్కరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ప్రభాకర్ శెట్టి, తంగరాజులు పాల్గొన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా రెవెన్యూ భవన్‌లో జరిగాయి. ఎన్నికల అధికారిగా పి.నరసింహ కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా పి.బాబ్జి ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా మారుఫ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మురళీమోహన్, ఉపాధ్యక్షులుగా అశోక్ కుమార్, శోభా, పన్నీరు సెల్వం, సంయుక్త కార్యదర్శిగా రిషివర్మ, ప్రసాద్, అస్రాఫ్ అలీషా, కోశాధికారిగా హేమాద్రి రాజు, క్రీడా కార్యదర్శిగా సూర్యప్రకాష్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రశేఖర్ కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్ కుమార్, అశ్విన్, కిరణ్ కుమార్, ఫణి కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హుస్సేన్, సుధాకర్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. సంఘ అభివృద్ధి ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వివరించారు.

సంచలన వ్యాఖ్యలు చేసిన జగన్ మేనమామ : రవీంద్ర నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో రాజకీయాలు మాట్లాడొద్దని ఇప్పటికే టీటీడీ పలు నిర్ణయాలు తీసుకుంది. కేవలం స్వామి వారి గురించి తమ అనుభవాలు లేదా భక్తితో ఆయనపై తమ నమ్మకాన్ని చెప్పడం మొదలైన మాటలు తప్ప కాంట్రవర్సీ రాజేసేవి, తప్పుడు మాటలు, రాజకీయాలు మాట్లడొద్దని టీటీడీ పాలక మండలి ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ క్రమంలో టీటీడీ తిరుమలలో ఎవరైన రాజకీయాలు మాట్లాడితే ఇప్పటికే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. మాజీ సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి తిరుమలలో కాంట్రవర్సీనీ రాజేశారు. పులివెందులలో జరుగనున్న జెట్పీటీసీ ఎన్నికలపై మాట్లాడారు. కూటమి సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు పులివెందులలో ఓటుతో చంద్రబాబు సర్కారుకు బుద్ధి చెప్పాలని కమలపూరం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలంతా జగన్ వెంట తామున్నామని చెబుతూ.. 12న పులి వెందులలో భారీగా ఓట్లు వేసి వైసీపీని గెల్పించుకొవాలన్నారు. దీనిపై ప్రస్తుతం రచ్చ మొదలైంది. తిరుమలలో ఇలాంటి కాంట్రవర్సీ మాటలు ఏమిటని టీటీడీ, టీటీడీ పాలక మండలి తీసుకున్న నిర్ణయానికి ఈ వ్యాఖ్యలు పూర్తిగా విరుద్ధమని టీటీడీ విజిలెన్స్ సీరియస్ అయ్యింది. దీంతో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిపై చర్యలకు టీటీడీ సిద్ధమైంది.

నీలకంఠుడికి ముక్కంటి సారె



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఊరందూరులో ఉన్న శ్రీకాళహస్తీస్వరాలయ అనుబంధ దేవాలయం నీలకంటేశ్వరస్వామికి ముక్కంటి తరపున ఆదివారం సారెను సమర్పించారు. అన్నపూర్ణ సమేత నీలకంటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణానికి ఈవో బాపి రెడ్డి కుటుంబ సమేతంగా సారె సమర్పించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎస్వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఓల్డ్ మెటర్నరీ హాస్పిటల్ పక్కన ఎస్‌విఎస్ హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్ రఘురాములు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. షుగర్, బీవీ, థైరాయిడ్ ఇతరత్రా వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కుమార్, డాక్టర్ అపర్ణ, వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తన కలిగి ఉండి, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ నగర్, ప్రగతి కార్యాలయంలో, వాకాడు మండలానికి చెందిన పనబాక శ్రీనాథ్ ఎన్.బి. కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండోవ సంవత్సరం చదువుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో ప్రగతి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ చేతుల మీదుగా పది వేల రూపాయలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, సెకరెటరీ చంద్రశేఖర్, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబసభ్యులు, ఐటిఐ ప్రభాకర్, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీ ఆధ్వర్యంలో 1.70. కోట్లతో టీటీడీ నిధులతో పునః ప్రారంభం చేశారు. రాజ గోపుర నిర్మాణ పనుల ప్రారంభం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విచ్చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రమేష్ అర్వీల్ల, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.

16న ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి

ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఆగస్టు 16వ తేదీన గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణశాలలో గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. శ్రీ కృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టిటిడి శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లను చేయనుంది. భారీగా పందిళ్ళు, మామిడితోరణాలు, పూమాలలతో అలంకారాలు చేపట్టనుంది. గోశాలకు విచ్చేసే భక్తులు గోశాలలో బెల్లం, బియ్యం, పశుగ్రాసాన్ని స్వయంగా పశువులకు తినిపించే అవకాశాన్ని టిటిడి కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఉదయం 5 నుండి 10.30 గంటల వేణుగానం, వేదపాఠశాల విద్యార్థులచే వేదపారాయణం, టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. ఉదయం గోపూజ, హారతి నిర్వహించ నున్నారు. 11 గంటల నుండి ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం హరికథ కార్యక్రమం నిర్వహించనున్నారు.

అభినయ్ చెత్త మాటలు మానుకో: ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోయాయని మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. సుందరయ్య నగర్‌లోని ట్రాన్సిట్ పాయింట్ వద్ద ఉన్న చెత్త వద్ద ఫొటోలకు పోజులు ఇచ్చి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై అభినయ్ రెడ్డి విమర్శలు గుప్పించారని ఆయన తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ మేయర్‌గా పని చేసిన వ్యక్తికి ట్రాన్సిట్ పాయింట్ అంటే తెలీదా అని ఆయన ప్రశ్నించారు. సుందరయ్య నగర్‌లో అభినయ్ రెడ్డి డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పుడు ట్రాన్సిట్ పాయింట్ ఉందన్న విషయం మరిచి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వార్డులోని వీధుల్లో చెత్త ఊడ్చాక ట్రాన్సిట్ పాయింట్‌లో చెత్తను పోసి ఉదయం, రాత్రి డంపింగ్ యార్డ్‌కు తరలించడం నిత్యం జరిగే పని అని అన్నారు. స్వర్ణాంధ్రా - స్వచ్ఛాంధ్ర గురించి మాట్లాడే అర్హత అభినయ్‌కి లేదని విమర్శించారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో పారిశుధ్యం ఎలా ఉండేదో ప్రజలందరికీ తెలుసని ఆయన చెప్పారు. గత నెలలో స్వచ్ఛ సూపర్ లీగ్ లో తిరుపతి గెలుపొంది ప్రెసిడెన్షియల్ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా వైసిపికి చెందిన మేయర్, కమిషనర్ మౌర్యాలు స్వీకరించారని ఆయన తెలిపారు. పరిశుభ్ర నగరంగా తిరుపతి ఉందా లేదా అని తన సొంత పార్టీకి చెందిన మేయర్‌ను అభినయ్ అడిగి తెలుసుకుంటే బాగుటుందని సూచించారు. పూటకో వేషంతో సొంత మీడియాకు తోడు సోషల్ మీడియాలో నిత్యం అబద్ధాలు ప్రచారం చేసుకోవడం అభినయ్ మానుకోవాలని హితవు పలికారు. వందలాది పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం కృషి చేస్తున్నారని, వారి కృషిని అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం టిటిడి నిధులు కొల్లగొట్టే ఎత్తుగడలో భాగంగా రెండు వేల మంది పారిశుధ్య కార్మికులను పెట్టుకోవాలన్న మీ దుర్బుద్ధిని ఎన్డీఏ కూటమి నాయకులు అడ్డుకోవడంతో అక్కసుతో ఆరోపణలు చేయడం అభినయ్ రెడ్డికి నిత్యకృత్యమైందని ఆయన తప్పుపట్టారు.